క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది హరీష్

బోథ్: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది హరీష్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ధర్మశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. గత 15 వారాలుగా ప్రతీ ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో రోగుల బంధువులతో పాటు ప్రజలకు అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేష్, రామకృష్ణ, విశాల్, ఆకాష్, గంభీర్, తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్



సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీసిన వైద్యులు

బోథ్: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భస్రావంతో వచ్చిన ఇద్దరు గర్భిణిలకు అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగోలేనందున సిజేరియన్ చేసినట్లు తెలిపారు. సహకరించిన వైద్యులు శైలజ, చైతన్యలు సూపరింటిండెంట్ రవీంద్ర ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు.

పరామర్శ



చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపీ నగేశ్

బోథ్: మండలంలోని బాధిత కుటుంబాలను మాజీ ఎంపీ నగేశ్ ఆదివారం పరామర్శించారు. సొనాల గ్రామంలో తుల సదానందం తల్లిమృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ సర్పంచ్ చిన్నయ్యకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కౌఠ మాజీ ఎంపీటీసీ స్వామిని, ధన్నూర్‌లో సురేందర్‌రెడ్డి, బోథ్‌లో అబూద్‌లను పరామర్శించారు. ఆయన వెంట బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, సహకార సంఘం అధ్యక్షుడు ప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వర్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎదులాపురం: ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవి మాత ఆలయంలో ఆదివారం మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ డీఎం కల్పన హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. నాయకురాలు భార్గవి దికొండవార్, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పశువుల రవాణా

- మహారాష్ట్ర నుంచి బేల మీదుగా
- నిబంధనలకు విరుద్ధంగా తరలింపు
- పట్టించుకోని అధికారులు



బేల నుంచి తరలిస్తున్న పశువులు (ఫైల్)

బేల: మండల కేంద్రం అడ్డాగా యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా కొనసాగుతోంది. పెన్‌గంగ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో పశువులను మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చి, బేల మీదుగా రవాణా చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఆదిలాబాద్, మెదక్, హైదరాబాద్ ప్రాంతాలకు కబేళాలకు తరలిస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారు. ఎక్కడ మాత్రం నిబంధనలు కానరావడం లేదు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

బేల మీదుగా..

మహారాష్ట్రలోని గడ్‌చాందుర్, భద్రావతి, వణి, వరోరా, ముకుడ్‌బంద్ ప్రాంతాల నుంచి పశువులను ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకువస్తున్నారు. కాలినడకన కూలీలతో మండలంలోని కాంఘర్‌పూర్, సాంగిడి రెవెన్యూ గ్రామాల శివారుల్లోని పెన్‌గంగ మార్గంలో వ్యాపారులు బేలకు తీసుకువస్తున్నారు. ఇక్కడి నుంచి ఇందిరానగర్, విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లోని అడ్డాల నుంచి వ్యానులలో పశువులను ఇష్టారాజ్యంగా కుక్కేసి కబేళాలకు తరలిస్తున్నారు. బేల– సిర్సన్న, జామిని (జైనథ్)లతో పాటు పెన్‌గంగ కెనాల్ మార్గంలో రవాణా సాగుతోంది. రెండు రోజులకోసారి రెండు, మూడు ఐచర్‌ల వ్యాన్లలో పదుల సంఖ్యలో పశువులను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఒక్కొక్క వ్యానులో 40 నుంచి 60 పశువులకు కుక్కేసి సొమ్ము చేసుకుంటున్నారు.

కానరాని నిబంధనలు..

పశువులను కబేళాలకు తరలించాలంటే నిబంధనలు పాటించాలి. కబేళాలల కోసం గోవుల తరలింపు పూర్తిగా నిషేధం, లేగదూడలు, చిన్న, యుక్త వయస్సు పశువులు, వ్యవసాయానికి పనికి వచ్చే పశువులు తరలించకూడదు. ఏదైనా పశువును కబేళాలకు తరలించాలంటే స్థానిక పశు వైద్యాధికారి తప్పనిసరిగా సర్టిఫికెట్ ఇవ్వాలి. అనారోగ్యం, వ్యవసాయానికి పనికిరానిది, వృద్ధాప్యంతో ఉన్నవి మాత్రమే కబేళాలకు తరలించాలి. అది కూడా పశుగ్రాసం సౌలభ్యంతో నిర్ణీత మొత్తంలో వాహనాల్లో తరలించాలి. కానీ దీనికి విరుద్ధంగా పదుల సంఖ్యలో పశువులను కుక్కి మూగజీవాల ప్రాణాలు తీస్తున్నారు. ఈ అక్రమ రవాణాపై పోలీసులు కూడా కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల అక్రమ రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



అక్రమంగా వ్యానుల్లో పశువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పశువుల అక్రమ రవాణా దందాపై సమాచారం ఇస్తే, కచ్చితంగా స్పందిస్తాం. నిఘా పెంచి అక్రమ రవాణా జరుగకుండా తగు చర్యలు తీసుకుంటాం.

– కృష్ణకుమార్, ఎస్సై, బేల

క్రికెట్ క్లబ్ ఏర్పాటు అభినందనీయం



క్రికెట్ కిట్ అందజేస్తున్న సాకటి దశరథ్

నేరడిగొండ: నేరడిగొండ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపొందడమే కాకుండా శారీరకంగా దృఢంగా ఉంటారని తెలిపారు. మూడు సంవత్సరాలుగా క్లబ్ తరపున ఎన్‌పీఎల్ టోర్నమెంట్ నిర్వహించి గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు అవకాశం కల్పిస్తున్నారని అభినందించారు. భవిష్యత్‌లో తనవంతుగా సహకారాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సాబ్లే సంతోష్ సింగ్, సోలంకి ప్రశాంత్, తొడసం శంకర్, చొక్కపల్లి రాములు, రాథోడ్ రాజశేఖర్, భాక్రే శంకర్, గణేష్, పవన్, నరేష్, లఖన్ సింగ్, యోగేశ్వర్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్ పోటీలను ఆదివారం ఎంపీపీ గండ్రత్ రమేశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యానికి వ్యాయమం లాంటివన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా సంబంధాలు మెరుగవుతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమేనని, ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు షేక్ ఆరీఫ్, ఉప సర్పంచ్ రాంసం వినోద్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, బొమ్మకింటి రమేశ్, రాజు, జగదీష్, శ్రీనివాస్, మోతిరాం పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలి

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మాధవి కృష్ణ



వన్‌కే రన్‌లో పాల్గొన్న న్యాయమూర్తి మాధవికృష్ణ

ఆదిలాబాద్: చిన్నారులు స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని తగ్గించేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మాధవి కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఆదివారం ఉదయం మాస్టర్ మైండ్స్ పాఠశాలల ఆధ్వర్యంలో గాడ్జెట్ ఫ్రీ చైల్డ్ హుడ్ అనే అంశంపై వన్ కే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా క్రీడాజ్యోతి పట్టుకుని ఉత్సాహంగా విద్యార్థులతో కలిసి ముందుకు సాగారు. స్మార్ట్ ఫోన్లు అధికంగా వాడడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు ప్లకార్డుల రూపంలో ప్రదర్శించారు. డీఎస్పీ ఉమేందర్ మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు సెల్‌ఫోన్ చూయిస్తూ.. అన్నం తినిపించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, మాస్టర్ మైండ్స్ స్కూల్ చైర్మన్ రాజీవ్ సంగాని, పాఠశాల డైరెక్టర్ సాయిని రవికుమార్, కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్వేత, వైస్ ప్రిన్సిపాల్ వసీం తదితరులు పాల్గొన్నారు

పంచాయతీలకు సొంత భవనాలు



బోథ్ మండలంలోని పిప్పల్‌ధరిలో పంచాయతీ భవనం లేకపోవడంతో చెట్టుకిందే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కేటాయించిన భవనాల మంజూరులో పిప్పల్‌ధరి గ్రామం లేదు. ప్రస్తుతం అద్దె భవనంలో పంచాయతీ రికార్డుల నిర్వహణ సాగుతోంది. నెలకు వెయ్యి రూపాయల అద్దె చెల్లిస్తున్నారు. భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని సర్పంచ్ శ్రీధర్ రెడ్డి కోరుతున్నారు.



అద్దె భవనంలో పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ

- ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మాణం
- జిల్లాలో 125 పంచాయతీలకు సొంత భవనాలు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచులు

బోథ్: పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రజలు, అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాలు, శిథిలావస్థలో ఉన్న వాటిలోనే పంచాయతీ పాలన కొనసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం కొత్త వాటితో పాటు పలు పాత పంచాయతీలకు ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 3687 పంచాయతీలకు భవనాలు మంజూరు చేయగా.. జిల్లాకు 125 పంచాయతీలకు సొంత భవనాలు మంజూరయ్యాయి. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తమ ఇబ్బందులు దూరం కానున్నాయని ప్రజలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బోథ్ నియోజకవర్గానికి అత్యధికం..

జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు ఉన్నాయి. కాగా ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాలకు చెందిన పలు పంచాయతీలు కూడా జిల్లా పరిధిలో ఉన్నాయి. జిల్లాలో మొత్తం 468 పంచాయతీలు ఉన్నాయి. 125 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలను మంజూరు చేశారు. కాగా ఆదిలాబాద్‌కు 28 పంచాయతీలకు భవనాలు మంజూరు కాగా, అత్యధికంగా బోథ్ నియోజకవర్గానికి 66, జిల్లా పరిధిలోని ఆసిఫాబాద్‌లో 19, జిల్లా పరిధిలోని ఖానాపూర్‌లో 19 మంజూరయ్యాయి. ఒక్కో గ్రామం పంచాయతీకి రూ. 16 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు కేటాయించనున్నారు.

ఉపాధిహామీ నిధులతో నిర్మాణం..

పంచాయతీలకు భవన నిర్మాణాన్ని ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించనున్నారు. గతంలో ఒక్కో గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షలు కేటాయించి నిర్మించారు. కాగా ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా పంచాయతీల భవన నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం పెంచింది. భవన నిర్మాణం కోసం ఆయా గ్రామ పంచాయతీలు స్థలాన్ని చూపించాల్సి ఉంటుంది.

ఇబ్బందులు తీరుతాయి



ప్రభుత్వం నక్కలవాడ పంచాయతీకి నూతన భవనం మంజూరు చేసింది. ప్రస్తుతం అంగన్‌వాడీలో కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పంచాయతీ కార్యాలయ పనులు నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– విజయ్, సర్పంచ్, నక్కలవాడ

మరిన్ని మంజూరు చేయాలి

అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాం. నూతన భవనాల మంజూరులో మా పంచాయతీకి చోటు దక్కలేదు. చిన్న పంచాయతీలకు సైతం భవనాలు మంజూరు చేయాలి. భవనాల మంజూరుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి. జిల్లాలో ఇంకా 150 వరకు గ్రామ పంచాయతీల్లో భవనాలు లేవు. మరో విడతలో భవనాలను మంజూరు చేయాలి.

– శ్రీధర్ రెడ్డి, సర్పంచ్, పిప్పలధరి

తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి

ఎదులాపురం: విద్యార్థులు క్రమ శిక్షణతో మెలుగుతూ తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నతంగా ఎదగాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. పట్టణంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎస్పీ ఉమేందర్, పాఠశాల చైర్మన్ రాజీవ్ సంగాని, డైరెక్టర్ సాయిని రవికుమార్, ప్రిన్సిపాల్ శ్వేత పాల్గొన్నారు.

'పేదలకు భారంగా గ్యాస్‌బండ'



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు వంటగ్యాస్ భారంగా మారిందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. ఆదివారం గ్యాస్ సిలిండర్లను రిక్షాలో ఉంచి జిల్లా కేంద్రంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు ఇప్పటికే నింగినంటుతుండగా.. పెట్రోల్ ధరలు సైతం అమాంతం పెరుగుతున్నాయన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, వెడ్మబొజ్జు పటేల్, కాంగ్రెస్ నాయకులు సంజీవ్ రెడ్డి, నగేశ్, శంతన్‌రావు, గంగన్న, అర్ఫాత్‌ఖాన్, స్వామి యాదవ్ పాల్గొన్నారు.

- పకడ్బందీగా అమలు 'రీడింగ్ చాలెంజ్'
- మెరుగుపడుతున్న విద్యార్థుల చదువు

నార్నూర్: గత రెండేళ్ల క్రితం కరోనా ప్రభావంతో విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు గణనీయంగా తగ్గాయి. ప్రత్యక్ష తరగతులు నిర్వహించకపోవడమే ప్రధాన కారణం. ఈక్రమంలో విద్యార్థులను గాడిలో పెట్టేందుకు ప్రాథమిక పాఠశాలల్లో 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో గత ఏడాది కస్తూరిబా బాలికల విద్యాలయాల్లో 'రీడింగ్ చాలెంజ్'కి శ్రీకారం చుట్టారు. మూడు నెలలు నుంచి ప్రత్యక్ష బోధన కొనసాగుతోంది. ప్రతీ రోజు తెలుగు పీరియడ్‌లో 10 నుంచి 15 నిమిషాల సమయాన్ని విద్యార్థుల చదువుకోసం కేటాయిస్తారు. విద్యార్థులు చదువుకునే ఆడియోను సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తారు. వాటిని ఖాళీ సమయాల్లో పరిశీలించి తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఉత్తమ ప్రతిభావంతుడిని ఎంపిక చేస్తున్నారు. వారిని తర్వాత రోజు తరగతి గదిలో ప్రశంసిస్తున్నారు. 6 నుంచి 9వ తరగతి చదివే వారికి అమలు చేస్తున్నారు. నార్నూర్, గాదిగూడ మండల కేంద్రాల్లో కస్తూరిబా గాంధీ పాఠశాలలు ఉన్నాయి. 500మందికి పైగా బాలికలు చదువుకుంటున్నారు. ప్రతిభ ఆధారంగా ధారాళంగా నెమ్మదిగా చదివే వారిని గుర్తించి మూడు గ్రూపులుగా విభజిస్తున్నారు. వెనకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదువులో మెలకువలు నేర్పిస్తున్నారు. విద్యార్థుల లోటుపాట్లను సవరిస్తూ.. ప్రత్యేక డైరీని సైతం నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల్లో అవగాహన..

కస్తూరిగా గాంధీ పాఠశాలలో అమలు చేస్తున్నా రీడింగ్ చాలెంజ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం పెరగడంతో పాటు చదువుపై ఆసక్తి కూడా పెరుగుతుంది. ప్రతీ రోజు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సబెక్టుల్లో నిర్ణయించిన పాఠాన్ని చదివిస్తారు. విద్యార్థులను గ్రుపులుగా విభజించి చదవడంతో పాటు రాయడంపై పట్టుసాధించేలా అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులు బోధించిన తర్వాత ఎక్కువసార్లు చదవడం, వినడంతో ద్వారా గుర్తుంటున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



భజన చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్: పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో గల శ్రీ పంచముఖి హనుమాన్ దేవాలయం 12వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి శివశ్రీ రామగిరి చంద్రకాంతయ్య ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, గణపతి, గౌరీ పూజ, పుణ్యవచనం, అభిషేకం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

అటెన్షన్ ప్లీజ్.. కలుషితమవుతున్న బోరునీరు



గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న బోరు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తాగునీరు మురుగుగా మారుతోంది. దీనికి చిన్నపాటి మరమ్మతులు చేయాల్సి ఉన్నా.. పరిసర ప్రాంతాల్లోని చిరు వ్యాపారులు, హోటళ్లు ఈ నీటిని వినియోగిస్తున్నారు.

– సంబంధిత అధికారి: రాందాస్, పంచాయితీ కార్యదర్శి, ఫోన్: 94411 57826

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తాంసి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. భీంపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా దనోర గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త గోసుకల ఆశన్న కుటుంబాన్ని రూ. 2లక్షల రూపాయల బీమా చెక్కు కుటుంబసభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన సాగుతోందన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా మార్చి 8 నుంచి ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ సంతోష్, తహసీల్దార్ మహేంద్రనాథ్, సర్పంచ్ లింబాజీ, అనిల్, సంతోష్, నరేందర్, సర్పంచ్‌లు గంగయ్య, రాజన్న, హనుమాన్ దాస్ పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

తాంసి: దేశ రక్షణ కోసం నిరంతరం సేవలను అందిస్తున్న సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం భీంపూర్ మండల కేంద్రంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. 26 ఏళ్ల పాటు దేశ రక్షణకు సేవలందించిన భీంపూర్ మండల కేంద్రానికి చెందిన సుబేధార్ రాథోడ్ విలాస్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. జాతీయ జెండాతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారి మజర్ హుస్సేన్, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ సంతోష్, సర్పంచ్ లింబాజీ, ఉప సర్పంచ్ రవీందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగయ్య యాదవ్, వెంకట్ రెడ్డి, నాయకులు మణిరాం, జాదవ్ గణేష్, కల్పప్ యాదవ్, నరేందర్ యాదవ్ పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..



మండలంలోని తర్నం(కె) గ్రామానికి వెళ్లే రహదారి కంకర తేలి అధ్వానంగా మారింది. రోడ్డు నిర్మించిన మూణ్నాళ్లకే కంకర తేలడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి తర్నం(కె) వరకు ఉన్న రెండు కిలోమీటర్లు పూర్తిగా కంకరతేలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– నేరడిగొండ

విద్యా సామర్థ్యాల పెంపే లక్ష్యం



గ్రూపులుగా చదువుతున్న విద్యార్థులు

పకడ్బందీగా అమలు చేస్తున్నాం



పాఠశాల ప్రారంభం నుంచే రీడింగ్ చాలెంజ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. సబెక్టుల్లో వెనకబడిన వారిని గుర్తించి వారు మెరుగుపడేలా చూస్తున్నాం ఏమైనా సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది.

– ప్రియాంక, ఎస్‌వో, కస్తూరిబా గాంధీ పాఠశాల, గాదిగూడ